కథ

# అనాలోచితం

బి. లక్ష్మీనారాయణ

**... ...అలానే అనిపిస్తుంది ఎవరికైనా... హవ్వ; యిదేమిటీ... యీ పద్ధతేమిటి... యీ తరహా ఎక్కడిదీ... మనం ఏం చేసినా... సమాజంలో... పోనీ... కుటుంబంలో... ఏ వొక్కరైనా సమర్థించాలి కదా... కానీ జరిగిందేమిటీ... అంతా నా కర్మని అనుకోవాలా... కనీసం పిల్లదాని భవిష్యత్తేమిటీ... అని కూడా ఆలోచించాలి కదా...**

"అమ్మా... యీ నాన్న మనకొద్దే... పంపించెయ్యవే..."


కన్నపేగు కళవెళ పడుతూ... పలవరిస్తోంది.. గుండెల్ని పిండేస్తూ...

"తల్లీ..." అంటూ నుదుటి మీద చెయ్యేసి చూసాను... కాలిపోతోంది... వారం రోజుల నుంచి పిల్ల నలిగిపోతోంది...

... కానీ యింతవరకూ పిచ్చి తల్లికి కేవలం... తన మీద అందరూ జాలి పడటమే తెలుసు... తండ్రిలేని పిల్లని... యిప్పుడు... ఆ జాలి చూపుల్లోంచి... వెక్కిరింతా... ఎగతాళి... చులకనా... భరించలేకపోతోంది... పిల్ల.

"అమ్మా... వద్దే..."

"తల్లీ..." అంటూ... మరింత దగ్గరకు తీసుకుని భుజం మీద రాస్తూ... "పిచ్చితల్లీ... లేదమ్మా..." అన్నానేగానీ...



ఎలా చెప్పాలి... ఎదుగుతున్న పిల్లకి... ఏం చెప్పాలి... ఎంత వరకూ చెబితే తను పరిస్థితిని అర్థం చేసుకోగలుగుతుందసలు...

ప్చ్... అంతా నుదుటి రాత... కేవలం... లేకపోతే ఏమిటిదంతా....

***

దిగువ మధ్య తరగతి కుటుంబంలో నలుగురు పిల్లల్లో నాల్గవదాన్ని... తిండికి ఎప్పుడూ కొరతే... నాన్న టైలరింగ్ చేస్తూనే... ముగ్గురు అక్కలకి పెళ్ళిళ్ళు చేసాక... శరీరంలో ఎడమ భాగం చచ్చుబడిపోయింది... అప్పుడు యింట్లో... పరిస్థితి మరింత దిగజారడమూ... పైగా అమ్మ యిటువంటి దిగుళ్ళతోనే ముందుగా వెళ్ళిపోవడంతో... నన్నొక యింటిదాన్ని చేయాల్సిన బాధ్యతా... నాన్నను మరింత క్రుంగదీసింది... అటువంటి పరిస్థితుల్లోనే 'గంతకు తగ్గ బొంత' లాంటి యీ సంబంధం వచ్చింది... ఆరుగురు పిల్లలు మధ్య ఒకే ఒక కొడుకుగా... ముగ్గురు అక్కలూ... మరి ముగ్గురు చెల్లెళ్ళ పెళ్ళి బాధ్యతలు ఎలాగో యీయన తండ్రి నెరవేర్చేడు కూడా... అప్పటికే పనంటూ ఏం చేయకపోయినా... బాధ్యతలు మీద పడ్డాక కూడా... ఏ పనీ చేయకుండా వుంటాడా... అనుకుని లేదా సర్దిచెప్పుకుని... అల్లుడిగా తెచ్చుకున్నాడు నాన్న... పైగా వీళ్ళ నాన్న కూడా ఏదో చిన్నా చితకా పనిచేసి కదా... ఆరుగురు పిల్లల పెళ్ళి చేసిన బాధ్యతెరిగిన కుటుంబ పెద్ద కదా అని కూడా... ఆలోచించాడు నాన్న...

నిజానికి నా పరిస్థితే... పెనం మీంచి పొయ్యిలో పడినట్లయింది... అయినా అప్పుడూ... యిప్పుడూ కూడా నా గోడు పట్టించుకున్నది ఎవరూ లేరు...

"అమ్మా... వద్దే..." అంత జ్వరంలో కూడా... అప్పుడే స్నానం చేసినట్లుగా శరీరమంతా చెమట ధారలు...

"తల్లీ... అలాగేనమ్మా... తగ్గిపోతుంది... పడుకో..." అన్నాను అనునయంగా భుజం మీద రాస్తూ... టైము చూస్తే నాలుగున్నరవుతోంది...

కాలక్రమంలో యిద్దరు పిల్లలు పుట్టి చనిపోయారు... యింట్లో పెరుగుతున్న బాధ్యతలు... సంపాదించే చేతులుకన్నా... తినే నోళ్ళు ఎక్కువ కావటంతో... మామయ్య కూడా... వయసు మీద పడటంతో... పైగా ఎప్పుడూ ఎవరో వొకరు బంధువులు... మా ఆడపడుచుల్లో ఎవరో ఒకరు ఎప్పుడూ యిక్కడే వుంటూంటారు... పైగా వాళ్ళ పిల్లలూ... అత్తగారూ... మామయ్యా... యిన్నిన్ని కష్టాల మధ్య... యిదుగో యిది కడుపున పడ్డాక యిప్పుడే వస్తానంటూ వెళ్ళిన యీ మనిషి... మరలా పత్తా లేడు... ఎక్కడని వెదకనూ... ఎలా... అక్కడికీ... తెలిసినవాళ్లందరూ... వాళ్లకు తెలిసినవాళ్ళ ద్వారా కూడా... అంతటా వెదికారు... వెదికించారు.

***

ఎంత కాలమైంది... పుష్కరం దాటిపోలేదూ... యీ పిల్లప్పుడే ఏడవ తరగతిలో కొచ్చింది కూడా...

కదా...;

దీని చిన్నప్పుడొకసారి... "అమ్మా... నాన్నేడే..." అంది... గొంతు వణకుతూండగా... మొహమంతా ఎర్రగా కందిపోయి వుంది... బాగా ఏడ్చినట్లుంది...

"ఏమైందమ్మా..." అన్నాను దగ్గరకు తీసుకుంటూ...

"ముందు యిది చెప్పు... నాన్నేడీ..." అంది... నడుంమీద రెండు చేతులు పెట్టుకుని పెద్ద ఆరిందాలా... అచ్చు వాళ్ళ నాన్న లాగే...

పరిస్థితి అర్థమైంది... కానీ ఎలా చెప్పాలి... ఏమని చెప్పాలి... నాకు తెలిస్తే కదా... దానికి చెప్పడానికి... అనుకుంటూంటే... కళ్ళమ్మట నీళ్ళు వచ్చేశాయి... కొంగు నోటిలో కుక్కుకున్నాను...

"అమ్మా... వద్దే ... మరలా యింకెప్పుడూ అడగనే... నువ్వు ఏడవకే... అమ్మా... నాకూ ఏడుపొస్తోందే..." అంటూ... నన్ను చుట్టుకుపోయింది... ఆర్తిగా...

"పిచ్చి తల్లీ..." అంటూ తల నిమిరాను అసహాయంగా చూస్తూ...

పాల వేన్ చప్పుడు వినవస్తోంది బయట... కళ్ళు మండుతున్నాయి నిద్ర లేకపోవడమూ... జ్వరంతో... తెల్లవార్లూ కలవరిస్తున్న పిల్లని చూస్తూ... బెంబేలు పడుతూ... పిల్లదానికి సపర్యలు చేస్తూ... కంగారుతో వున్న నాకు...జాగారమైపోయింది...

"తల్లీ... లేచావా... జ్వరం తగ్గిందామ్మా..." అంటూ నుదుటిమీద చేయి వేసాను... నాలుగు రోజుల జ్వరానికే... కళ్ళు లోతుకుపోయి... బుగ్గలు పీక్కుపోయాయి... మెల్లగా తడిగుడ్డతో మొహమూ... శరీరమూ... తుడిచి... "యిదుగో యీ జావ తాగు... జ్వరం యింకా తొందరగా తగ్గిపోతుంది... అప్పుడు నువు చక్కగా స్కూలుకు కూడా వెళ్ళొచ్చు..." అన్నాను అనునయంగా...

"వూహు..." తలడ్డంగా వూపుతూ... "నేను స్కూలుకు వెళ్ళను ...." అంది.

"అదేమిటమ్మా... యిప్పుడే కాదు జ్వరం పూర్తిగా తగ్గాకనే కదా.

"అమ్మా... మా స్కూల్లో చాలా మంది పిల్లల తండ్రులో... తల్లులో... దుబాయిలోనో... సాదీలోనో... లేదా... అమెరికాలోనో... మరి... వొకరిద్దరు పిల్లల తలిదండ్రుల్లో ఎవరో వొకరు లేదా యిద్దరూ చనిపోవడం జరిగింది... కాని... మరి... మనకేంటమ్మా... యిలా అయింది..." అంటూ "లేకపోతే... నాన్న చనిపోయాడని చెబుదామా..."

పైగా అప్పుడే... వారంపైగా అయింది..." అంతవరకూ ఎప్పుడూ... ఏ క్లాసులోనూ... వారం రోజులు స్కూలు మానేయడమంటూ... ఎరగని పిల్లను కొత్తగా చూస్తూ...

మరేమీ మాట్లాడకుండా జావ తాగేసి... నీరసంగా పడుకుంది...

యింకోసారి... రెండేళ్ళయిందనుకుంటా... అవును... అంతే... పాప అయిదో తరగతి చదువుతూండగా.... "అమ్మా... మా స్కూల్లో చాలా మంది పిల్లల తండ్రులో... తల్లులో... దుబాయిలోనో... సాదీలోనో... లేదా... అమెరికాలోనో... మరి... వొకరిద్దరు పిల్లల తలిదండ్రుల్లో ఎవరో వొకరు లేదా యిద్దరూ చనిపోవడం జరిగింది... కాని... మరి... మనకేంటమ్మా... యిలా అయింది..." అంటూ "లేకపోతే... నాన్న చనిపోయాడని చెబుదామా..." అంది... పెద్ద సమస్యని చాలా సులువుగా తేల్చేసినట్లుగా చూస్తూ...

ఏమని చెప్పను... ఎలా చెప్పను... అసలు నాకంటూ... తెలిస్తేగదా... ఏం చెప్పాలన్నా. అదీ కాకుండా... పాప చిన్నప్పట్నించీ తండ్రి గురించి వేసే ప్రశ్నలన్నింటికీ... నేనిచ్చే సమాధానం ఒకటే... అది... కన్నీళ్ళు... అది నా అసహాయత్వానికి నిదర్శనమే కాదు... బహుశా బలంగా ప్రకటిస్తున్న 'ఆక్రోశం' లేదా సమస్య నుంచి తాత్కాలిక వోదార్పు లేదా ఉపశమనం కూడా... నిజానికి పాపకు కూడా... నేనిచ్చేది... అదే మందేమో...

క్షమించమ్మా... మరెప్పుడూ నాన్న గురించడిగి... నిన్ను బాధపెట్టను..." అంది నన్ను చుట్టుకుపోతూ...

అదే ఆఖరు మరలా తను అడిగింది లేదు... నేను చెప్పింది లేదు... పది రోజుల క్రితం వరకూ... ప్చ్...


***

"అమ్మా... ఎవరే ఆయనా... ముందు గదిలో పడుకున్నదీ... నా పుస్తకాల సంచీ కూడా అక్కడే వుందీ..."

అంటూ వచ్చింది ఉదయాన్నే పాప... దగ్గరకు తీసుకుని తల దువ్వుతూ... చెప్పాను... విసురుగా వెనక్కి నాకేసి తిరిగి... 'ఛీ' అంటూ... కళ్ళు అరచేతులతో మూసుకుంది...

"తప్పమ్మా... అలా అనకూడదు... ఆయనే... మీ నాన్న అమ్మా..." అన్నాను పొడిగా చూస్తూ...

"ఛీ... కానేకాదు..." అంటూ టిఫిన్ కూడా తినకుండానే స్కూలుకు మామూలుకంటే చాలా తొందరగా వెళ్ళిపోయింది...



ఆ సాయంత్రం... స్కూలు నుంచి వచ్చిన పాప చాలా ముభావంగా వుంది... ఎప్పుడూ అలా లేదు... రాగానే స్కూలు కబుర్లన్నీ చెప్పేది. అలాంటిదివాళ ఏమిటిలా... అనుకుంటూ... "ఏమైందమ్మా" అన్నాను దొడ్లో మొహం కడుక్కొంటూంటే... ఏం మాట్లాడలేదు పాప... అప్పుడు యింట్లో... వాళ్ళ... 'నాన్న' కూడా లేడు...

కిటికీ దగ్గరగా కూర్చొని రోడ్డుకేసి చూస్తోంది. నిజానికి ఆ కళ్ళల్లో కనిపించే గూడు కట్టుకున్న గొప్ప శూన్యం... మాటల్లో చెప్పలేని నిర్వేదం... భయం వేసింది...

సరిగ్గా నాలుగు రోజుల కిందట... మామూలుగా స్కూలు నించి వచ్చిన పాప ఒళ్ళు జ్వరంతో పేలిపోతోంది... నిజానికి యీ వారం రోజులూ కూడా పాప చాలా ముభావంగానే వుంటోంది... "ఏమైందమ్మా డాక్టరు దగ్గరకు వెడదా"మంటూంటే... అప్పుడే వచ్చిన వాళ్ళ నాన్న... "నేను తీసుకెళతా..." నన్నాడు... కానీ... పాప గట్టిగా ఏడుస్తూ... "రానని" చెప్పడంతో... "సరేలే... నేనే తీసుకువెళతాలే" నంటూ రిక్షాలో దగ్గర్లోని డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాను...

ఆ రాత్రి నించీ పాప పలవరింతలూ... నిజానికి యీ వారం–పది రోజుల్లో వొక్కసారిగా మారిన యింటి వాతావరణంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నామందరమూనూ...

నేను గమనించలేదు కానీ... యింట్లో వున్న మా ఆడపడుచులిద్దరూ ఎప్పుడు వెళ్ళిపోయారో తెలీలేదు... అసలు నిన్నో... మొన్నో... మా పెద్దాడపడుచు రావాలి కదా పురిటి కోసం...

ఆరోగ్యం

# అధిక బరువుతో అనారోగ్యాలెన్నో...

వయసునుబట్టి, ఎత్తును బట్టి ఉండాల్సిన దానికన్నా ఎక్కువ బరువు ఉంటే అధికబరువుతో ఉన్నట్టు లెక్క. మన శరీరంలో కొవ్వు శాతం ఎక్కువైతే వచ్చే సమస్య ఇది. కొవ్వుశాతం పెరగడంతో మనిషి లావెక్కటం, బరువు పెరగటం సర్వసాధారణం. ఇలా ఉండాల్సిన దానికి మించి ఎక్కువ బరువు ఉండటం ఆరోగ్యసమస్య. ఇది అనేక ఇతర సమస్యలకి దారి తీస్తుంది. అధిక రక్తపోటు, డయాబెటిస్, గుండె జబ్బులు, పక్షవాతం, కీళ్ళనొప్పులు, ఆయాసం, నిద్రపట్టకపోవడంలాంటి సమస్యలు వచ్చే అవకాశముంది. ఇవన్నీ ఒకేసారి వస్తాయని కాదు. ఆయా వ్యక్తులు తమ బరువు పెరుగుతున్న విషయాన్ని గమనించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఇలాంటి సమస్యలకు లోను కాకుండా ఉండే అవకాశముంది. బరువు పెరుగుతున్నా తమ శరీరం గురించి పట్టించుకోకుండా తమ అలవాట్లను యధాతథంగా కొనసాగించేవారు ఇతర రకాల ఆరోగ్యసమస్యలకి లోనవుతారు. రాత్రివేళల్లో నిద్రపట్టక సతమతమవుతారు. ఎక్కువ బరువు పెరగడంవల్ల కొందరు నిద్రలో గురక పెడతారు. ఇది పక్కవారికి కూడా కష్టంగా ఉంటుంది. సెక్స్‌లోనూ సమస్యలకు లోనయ్యే అవకాశం ఉంది. ఆరోగ్యకరమైన వ్యక్తులకీ, అధిక బరువు వున్నవారికీ మధ్య లైంగికపరమైన కార్యకలాపాల్లో తేడాలుంటాయి.

ఆహారం విషయంలో అప్రమత్తంగా లేకపోవటం, తాము ఏం తినాలో తెలియక ఏదో ఒకదానితో కడుపు నింపేయడం, మద్యం అలవాటు, వేళకాని వేళల్లో అధికంగా తినడం, ఒక వయసు వచ్చిన తరువాత ఆహారపుటలవాట్లలో మితం పాటించకపోవడం బరువు పెరగడానికి దారి తీస్తుంది. ఎక్కువగా తినడమే గాక సరైన వ్యాయామం చేయకపోవడం వల్ల కూడా మనుషులు బరువు పెరుగుతారు.

## మితాహారం మంచిది

మనిషి ముప్పయ్యేళ్ళు దాటాక ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. తమ ఆరోగ్యానికి సరిపడిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. జిహ్వాచాపల్యం తగదు. కొవ్వును పెంచే పదార్థాలకు దూరంగా ఉండాలి. చక్కెరకి దూరంగా ఉండాలి. ఉప్పు మానకూడదు. కాని తగ్గించాలి. అనవసరమైన ఉపవాసాలు కూడదు. ఉపవాసం కూడా ఒక పద్ధతిగా ఉండాలి. కడుపును ఎండబెట్టడం వల్ల బరువు తగ్గుతామన్నది అపోహ మాత్రమే. అలాగే ఉదయం పూట టిఫిన్ తినడం మానేయడంవల్ల కూడా ప్రయోజనం ఉండదు. ఏదైనా క్రమపద్ధతిలో జరగాలి. ఒకపూట మానేసి మరో పూట ఎక్కువగా తినేవారు చాలామంది ఉన్నారు. దీని వల్ల బరువు తగ్గరు. మీ శరీరతత్వానికి సరిపడిన ఆహారం ఏమిటో తెలుసుకోవాలి. తగని ఆహారానికి దూరంగా ఉండాలి. ఎలాంటి ఆహారం తీసుకోవాలో కూడా తెలిసివుండాలి. బరువు పెరిగి వివిధరకాల ఆరోగ్యసమస్యలు వచ్చేవరకు నిర్లక్ష్యం వహించకుండా ముందుగానే వైద్యుల్ని సంప్రదించాలి. మీ బరువు పెరగడానికి వారి గైడెన్స్ తీసుకోవాలి. హోమియో వైద్యవిధానంలోనూ బరువు తగ్గడానికి అవసరమైన సమాచారం ఉంది. హోమియో వైద్యుల్ని సంప్రదిస్తే మీ వయసు, శరీరతత్వం, బరువును బట్టి మీకు అవసరమైన సూచనలు చేస్తారు. ఏదైనా ఆరోగ్యసమస్య వుంటే నివారణ మందులు ఇస్తారు. ఒబేసిటీ అనేకరకాల ఆరోగ్యసమస్యల్ని తెచ్చిపెడుతుంది. కనుక దీనిని ఒక రోగంగా పరిగణించి దాన్నించి మిమ్మల్ని మీరు విముక్తి చేసుకోవడం అవసరం. మద్యం తాగడం, స్మోకింగ్ వంటి అలవాట్లకి క్రమంగానైనా స్వస్తి చెప్పాలి. ఎందుకంటే ఎవరైనా ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో ఏమైనా సాధిస్తారు. కనుక అధికబరువును తగ్గించుకుని ఆనందంగా ఉండటానికి ప్రయత్నించండి.

*కొవ్వును పెంచే పదార్థాలకు దూరంగా ఉండాలి. చక్కెరకి దూరంగా ఉండాలి. ఉప్పు మానకూడదు. కాని తగ్గించాలి. అనవసరమైన ఉపవాసాలు కూడదు. ఉపవాసం కూడా ఒక పద్ధతిగా ఉండాలి. కడుపును ఎండబెట్టడం వల్ల బరువు తగ్గుతామన్నది అపోహ మాత్రమే.*

**- డా.దండెపు బస్వానందం**

---

కానీ... రాలేదెందుకో... మరి... ఆ సాయంత్రమనుకుంటా చెప్పింది మా అత్త... "యిక్కడకు రావడం లేదనీ కబురు వచ్చిందంటూ... కారణం తెలీలేదం"టూ తలొంచుకుంది. అర్థమైంది... ఆ తల్లి మనసు. ప్రకృతికి విరుద్ధంగా నడుస్తున్న పుత్రరత్నం నిర్వాకం... అందువలనే అనుకుంటా... మా ఆడపడుచులూ... వాళ్ళ కుటుంబాలూ... మావయ్యా... అత్తయ్యా... మొత్తం ఖాందానంతా వొక రకంగా దూరంగా వుంచారనీ...

మొదట్నుంచీ సమస్యలతో నలిగి ఛిద్రమైపోయేది నేనేననిపించింది... ఒక పక్క వాళ్లంతా వాళ్ల వాళ్ల అభిప్రాయాలు నిర్మొహమాటంగానే అయినా ఖచ్చితంగా చెప్పగలిగారు... లేదా... సూచించగలిగారు... అత్తయ్యా మామయ్యలతో పాటుగా... యిటుపక్క వూహొస్తున్న పాప కూడా తన పద్ధతిలో తన భావాన్ని గట్టిగా చెప్తోంది.

కానీ... నా పరిస్థితి... అటుచూస్తే... పుష్కరం తర్వాత వచ్చిన 'భర్తా'... మరోపక్క వాస్తవ పరిస్థితి...'వికృత మనఃస్థితి... సమాజంలో కొంచెం చేస్తున్న... కాబడుతున్న... 'అటూ... యిటూ... కాని స్థితి'.

అసలు... 'తను'... యిలా కాకుండా మరెలా వచ్చినా సరే... పరిస్థితి మరొకలా వుండేదని... ఆయనకు కూడా అనిపించలేదా... కానీ... యిదేమిటి... ప్రకృతికి విరుద్ధమైన యీ వ్యక్తి నడవడిక... నడత....జాగ్రత్తగా పొదిగిన హారంలోగల కంటికి సైతం కనిపించని ఆ సూత్రమూ పుటుక్కున తెగిన పూసలు... వాటిల్లో... కలగలసి బుగ్గలపై నించి నేల రాలిన కన్నీటి ముత్యాలు... నేలంతా చిందరవందరగా... అచ్చం నా మనస్సులా... కంగాళీగా... నా ఆలోచనల్లో పడి గమనించలేదు గానీ... ఆకాశంలో కమ్ముకున్న నల్లటి కారుమబ్బులు... దూరం నించి వీస్తున్న వానగాలి... యింతలో పెద్ద వురుము... మెరుపు నేస్తంతో కూడిన వాన...

"అమ్మా..." మంచం మీద నుంచి పాప వొక్కసారిగా..భయంగా.

"తల్లీ..." అంటూ అక్కున చేర్చుకున్నాను... యింతలో జల్లుగా మొదలై ధారలుగా వర్షం... గుండెలపై పొదవుకున్న పాప శరీరంలో ఏదో తేడా... ఆందోళనగా... పాపను చూస్తూ... 'పాపా భయం లేదమ్మా... నేనున్నాగా..." అంటూ మెల్లగా తల నిమురుతున్నా...

"పాపా...పాపా...పాపా..." అంటూ కుదుపుతున్నా... గొంతులో దుఃఖం వెల్లువెత్తుతూండగా 'పాపా' అన్నాను ఒక్కసారిగా అంతే...

దుఃఖంతో పూడుకుపోయిన గొంతు...ఆర్తిగా... ఆర్ద్రతతో చిక్కనయిన కరిమబ్బులు ఆకాశమంతా... మరింతగా వర్షం... వర్షం... ఏకధారగా... సితారలో తెగిన జీవన రాగం... నాదం... పాట ఆగింది.

వళ్ళో... కట్టెలా బిగుసుకున్న పాప - ఖననానికి ఏర్పాట్లు చూస్తూ మామయ్య...

మ్రోడులా నేను... నిర్వేదంగా... చూపుల్లో శూన్యం... గుండెల్లో గూడు కట్టుకున్న దుఃఖం కరిగి వర్షంలా కురుస్తూనే వుంది...

ఎక్కణ్ణించో... పీలగా వినవస్తున్న గొంతు... "అమ్మా... యీ నాన్నొద్దే... పంపిచెయ్యవూ..."

గుమ్మంలోంచి వర్షపునీళ్ళ ప్రవాహం చప్పుడు... అనంతంగా...

గుండెల్లోంచి వినవస్తూన్న కన్నీటి ఉధ్రుతి... అనంతానంతంగా... చిరంతనంగా...;;

●